# టెన్త్ పరీక్షల డ్యూటీ టీచర్లపై నజర్

- విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయుడి తొలగింపు
- మరో ఐదుగురికి షోకాజ్ నోటీసులు

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, మార్చి 19 : పది పరీక్షల విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులపై జిల్లా ఉన్నతాధికారులు నజర్ పెట్టారు. విధులను ఎవరు ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలకు ఉపక్రమిస్తున్నారు. మంగళవారం రెండో రోజు కరీంనగర్ జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను కలెక్టర్ పమేలా సత్పతి, డీఈవో జనార్దన్ రావు, తనిఖీ బృందాలతోపాటు ప్రభుత్వ పరీక్షల విభాగం సహాయ కమిషనర్ వేర్వేరుగా పరిశీలించారు. ఈ క్రమంలో రామడుగు మండలం గోపాలరావుపేట్ జడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేకుండా వాహనాలు రావడాన్ని ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. వెంటనే పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రాజమౌళిని విధుల నుంచి తొలగించారు. అలాగే గంగాధర మండలం పలు పరీక్ష కేంద్రాల్లో ఐడీ కార్డులు ధరించని ఇద్దరు ఇన్విజిలేటర్లకు, విధులకు హాజరు కాని ముగ్గురు ఇన్విజిలేటర్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు వివరించారు.

# పరిహారం ఇచ్చి ఆదుకోవాలి



ముస్తాబాద్: గన్నెవానిపల్లెలో పంటలు నష్టపోయిన రైతులతో మాట్లాడుతున్న వినోద్ కుమార్

- వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు ఎకరాకు పదివేలు ఇవ్వాలి
- ఎల్లయ్య కుటుంబానికి రూ.పది లక్షల సాయం అందించాలి
- గన్నెవానిపల్లె, సేవాలాల్‌తండా రైతులపై కేసులు ఎత్తివేయాలి
- బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి వినోద్‌కుమార్
- ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో పంటల పరిశీలన

సిరిసిల్ల టౌన్/ ముస్తాబాద్, మార్చి 19 : వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ఎకరాకు పది వేల చొప్పున పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని మాజీ ఎంపీ, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ముస్తాబాద్‌తోపాటు మండలంలోని పోతుగల్, సేవాలాల్‌తండా, గన్నెవానిపల్లె, తంగళ్లపల్లి మండలం ఓగులాపూర్‌లో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీంచారు. రైతులను వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సిరిసిల్లలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయాచోట్ల మాట్లాడారు. మొన్నటి వరకు సాగునీరు లేక పంటలు కోతలకు వచ్చే సమయంలో రైతులు చాలా నష్టపోయారని గుర్తుచేశారు. కొందరు కడుపు మండి పశువులను మేపారని, మరికొందరు పంటలకు అగ్గి పెట్టారని ఆవేదన చెందారు. ఈ సమయంలోనే ప్రకృతి కన్నెర్రచేసి వడగండ్ల వాన మరింత కుంగదీసిందన్నారు. రైతుల పరిస్థితి మరింత దిగజారకముందే ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న పంటలను తక్షణమే సర్వే చేయించి, రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనురాగ్ జయంతిని ఫోన్ ద్వారా కోరారు. పంటపొలాలకు కాలువల్లో మోటర్లు వేసుకుని నీళ్లుపారించుకున్న గన్నెవానిపల్లి, సేవాలాల్‌తండా రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ అంశంపై వెంటనే స్పందించాలన్నారు. వరి పంటలు పొట్ట దశలో ఉన్నాయని, ప్రభుత్వం విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేయాలన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ జనగామ శరత్‌రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ఆర్బీఎస్ మాజీ అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్ పాషా, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి, తన్నీరు గౌతమ్‌రావు, పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎరవెల్లి చంద్రశేఖర్‌రావు, ఎంపీటీసీ కొండని బాలకిషన్, రాచమడుగు సంతోష్‌రావు, రమేశ్‌రెడ్డి, చెవుల మల్లేశ్‌యాదవ్, ఎల్లం, మనోహర్, స్వామి, వెంకటేశ్ ఉన్నారు.

## ఎల్లయ్య కుటుంబానికి పరిహారం ఇవ్వాలి

ముస్తాబాద్‌లో భారీ వృక్షం విద్యుత్తీగలపై పడి స్తంభం కూలి ఎల్సాని ఎల్లయ్య మృతి చెందగా, మంగళవారం ఆ ప్రాంతాన్ని వినోద్‌కుమార్ పరిశీలించారు. అనంతరం ఎల్లయ్య ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి తక్షణమే ₹10 లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్లయ్య కుటుంబాన్ని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఫోన్‌లో కోరారు.



ఎండిన వరిని చూపుతున్న వినోద్‌కుమార్, పక్కన నాయకులు





# కోడ్ ఉంది.. జాగ్రత్త!

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో మరోసారి కోడ్ అమలులోకి వచ్చింది. ఈ నెల 16 నుంచే ఎన్నికల నియామవళి అమలవుతున్నది. ఈ సమయంలో సామాన్యులు అప్రమత్తంగా లేకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. తమ అవసరాల కోసమైనా రూ.50వేలకు మించి నగదు, బంగారం తరలిస్తే తగిన ఆధారాలు చూపాల్సి వస్తుంది. లేకుంటే సీజ్ చేసే ప్రమాదమున్నది. అందుకే ఎన్నికల కోడ్ ఏం చెబుతోంది? సామాన్యులు, పార్టీల అభ్యర్థులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనే విషయాలపై జోరుగా చర్చ జరుగుతున్నది.

- పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల నుంచే ఆంక్షలు
- 'నియమావళి' పకడ్బందీగా అమలు
- సామాన్యులు అప్రమత్తంగా లేకపోతే తిప్పలే
- ₹50 వేలకు మించి పట్టుబడితే ఆధారాలు చూపాల్సిందే
- గిఫ్ట్‌లు అక్రమంగా తరలించినా సీజే
- రాజకీయ పార్టీలకు కఠిన సమయమే
- ఉల్లంఘిస్తే అభ్యర్థులపై వేటే

కరీంనగర్, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మరుక్షణం (ఈ నెల 16) నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఇది ఎన్నికల ప్రక్రియ ముగిసే నాటికి అంటే.. జూన్ 6వ తేదీ దాకా కొనసాగనున్నది. ఎన్నికల్లో ప్రలోభాలను అడ్డుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్‌గా చర్యలు తీసుకుంటుండగా, ఉమ్మడి జిల్లా పరిధిలో నిఘా పెంచారు. చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును సీజ్ చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సామాన్య ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరమున్నది. బ్యాంక్ నుంచి నగదును డ్రా చేస్తే సంబంధిత స్టేట్‌మెంట్, ఏటీఎం ద్వారా డ్రా చేస్తే దానికి సంబంధించిన రసీదు తప్పనిసరిగా తనిఖీ దగ్గర ఉంచుకోవాలి. ₹50వేలకు మించి నగదు, అంత విలువైన బంగారం ఆధారాలు లేకుండా తరలించరాదు. పోలీసుల తనిఖీల్లో పట్టుబడితే తప్పనిసరిగా ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. లేదంటే ఈ నగదును, బంగారాన్ని సీజ్ చేసి కోర్టుకు స్వాధీన పరుస్తారు. ఎక్కువ మొత్తంలో నగదు, బంగారం పట్టుబడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. అంతే కాకుండా, ఐటీ శాఖకు అప్పగించి లెక్కలు చెప్పాల్సి వస్తుంది. గిఫ్ట్‌లు తరలించినా అవి అక్రమమని భావిస్తే తప్పనిసరిగా సీజ్ చేసే అధికారం ఎన్నికల అధికారులకు ఉంటుంది. కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత సీజ్ చేసిన మొత్తాన్ని సమీపంలోని ట్రెజరీలో జమ చేస్తారు. ఈ విషయాన్ని 24 గంటల్లో కోర్టుకు తెలియజేస్తారు.



నగరంలోని ఓ విగ్రహానికి వేసిన ముసుగు

## పార్టీలు.. అభ్యర్థులకు సంకటమే..

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో ఎన్నికల నియమావళి (ఎలక్షన్ కోడ్)పైనే చర్చ జరుగుతున్నది. కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత కొన్ని కీలక మార్పులు చోటు చేసుకుంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కొందరు ఎన్నికల కమిషన్ సిబ్బందిగా విధులు నిర్వర్తిస్తారు. కోడ్ వేళ ఏ రాజకీయ పార్టీకి ప్రయోజనాలు చేకూర్చేలా ప్రజాధనాన్ని ఉపయోగించరాదు. కొత్త ప్రభుత్వ పథకాలు, భూమి పూజలు, శంకుస్థాపనలు, ప్రకటనలు చేయరాదు. ప్రభుత్వ వాహనాలు, భవనాలు, స్థలాలను ఎన్నికల ప్రచారం కోసం వినియోగించరాదు. ఎలాంటి ర్యాలీలు, సభలు నిర్వహించినా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. కులం, మతం ప్రాతిపదికన ఏ రాజకీయ పార్టీ కూడా ఓట్లను అభ్యర్థించరాదు. మత ఘర్షణలు, కులాల మధ్య చిచ్చు పెట్టే రాజకీయ ప్రసంగాలు, ప్రకటనలు చేయరాదు. అభ్యర్థులు వ్యక్తిగత ధూషణలు, ప్రజా జీవితంతో సంబంధం లేని అంశాల జోలికి వెళ్లరాదు. మసీదులు, చర్చిలు, దేవాలయాల్లో ఎన్నికల ప్రచారం చేయరాదు. ఓటర్లకు డబ్బు, బహుమతులు ఇచ్చి ప్రలోభ పెట్టరాదు. ఓటర్లకు లంచాలు ఇవ్వడం, బెదిరించడం, అవమానించడం లాంటివి చేయరాదు.

## ఉల్లంఘిస్తే శిక్షలు

ఎన్నికల నియమావళిని అమలు చేసేందుకు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులను ఎన్నికల కమిషన్ రంగంలోకి దింపుతుంది. ఏదైనా రాజకీయ పార్టీ, లేదా అభ్యర్థి ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుంది. నేరాలు తీవ్రమైతే అభ్యర్థులను ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించే అధికారం ఉంటుంది. నియమావళిని ఉల్లంఘిస్తే జైలు శిక్షలు విధించే చట్టాలు కూడా ఉన్నాయి.

## ధర్మారంలో ₹2.80 లక్షలు సీజ్

ధర్మారం, మార్చి19: ధర్మారం మండల కేంద్రంలోని జక్కన్నపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి ₹2.80లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ టీ సత్యనారాయణ తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో జక్కన్నపల్లి వద్ద కరీంనగర్–రాయపట్నం రహదారిపై రెండో ఎస్ఐ అశ్విని కలిసి పలువురు పీసీలు వాహనాల తనిఖీ చేపట్టారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం టీఎస్‌కే తండాకు చెందిన ధరావత్ ఠాగూర్, లోకవత్ దేవేందర్‌కు చెందిన బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా వారి వద్ద ₹55 వేల నగదును గుర్తించినట్లు చెప్పారు. మరో బొలేరో వాహనంలో ప్రయాణిస్తున్న చొప్పదండి మండలానికి చెందిన సీహెచ్ అంజయ్య, బీ కుమార్, సీహెచ్ మల్లయ్య, ఆర్ అంజయ్య, బీ లచ్చయ్య వద్ద తనిఖీలు చేయగా వారి వద్ద ₹2.25లక్షల నగదును గుర్తించామని, ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకు అప్పగించినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, పక్కన ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్‌కుమార్, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, జడ్పీ చైర్‌పర్సన్ వసంత

# లిక్కర్ స్కామ్.. బీజేపీ కట్టుకథ

- ప్రాంతీయ పార్టీలు లేకుండా చేయాలనే ఈడీ అస్త్రం
- ఎన్నికల లబ్ధి కోసమే కవిత అరెస్ట్
- బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ధ్వజం
- ప్రశ్నించే గొంతుక కావాలంటే బాజిరెడ్డిని గెలిపించాలని పిలుపు

జగిత్యాల రూరల్, మార్చి 19: పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి కోసమే ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్ట్ చేశారని బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు విమర్శించారు. ప్రాంతీయ పార్టీలు లేకుండా చేయాలని మోడీ తన బ్రహ్మాస్త్రమైన ఈడీని వాడుతున్నారని ధ్వజమెత్తారు. లిక్కర్ స్కామ్.. అనేది బీజేపీ అల్లిన కట్టుకథ అని ఆరోపించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్‌పర్సన్‌తో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌ను అణగదొక్కేందుకు.. ప్రాంతీయ పార్టీలు రాష్ట్రాల్లో అధికారంలో ఉండకూడదనే ఉద్దేశంతోనే మోదీ, అమిత్‌షా డైరెక్షన్‌లో కవితను అన్యాయంగా అరెస్టు చేశారని విమర్శించారు. జగిత్యాల సభలో 'సబ్‌కూచ్ ఖరా' అని మోడీ చెప్పారని.. అసలు 'తెలంగాణ క్యా ఖరా' చెప్పాలని డిమాండ్ చేశారు. కవిత నిర్దోషిగా బయటకు వస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక కావాలంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ని గెలిపించాలన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల ముందు ఈడీ కవితను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ న్యాయ పోరాటంలో ప్రజలంతా కవితవైపే ఉన్నారన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల మాట్లాడుతూ, ఇప్పటి వరకు ఈడీ చాలా కేసులు నమోదు చేస్తే, అందులో 0.01 శాతం కూడా ప్రూవ్ కాలేదన్నా రు. అవినీతిపరులంతా బీజేపీలో ఉన్నారని, ఆ పార్టీలో చేరితే కేసులు మాఫీ అవుతాయన్నారు. కేసీఆర్ తెలంగాణ దాటివస్తే బీజేపీకి మనుగడ ఉండదనే ఉద్దేశంతోనే అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, బీజేపీ అధికారంలో ఉండగా ఉత్తమ పార్లమెంట్ అవార్డు తీసుకున్న కవితను కేవలం ఎన్నికల స్టంట్ కోసమే అక్రమంగా అరెస్ట్ చేశారని మండిపడ్డారు. బీజేపీలో చేరితే ఎన్ని కేసులు ఉన్నా వాషింగ్ పౌడర్ నిర్మాలా మారుతారన్నారు. ముందు రాజకీయాలు మాని.. రాష్ట్రంలో రైతులకు సాగునీరు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలో చేరకుంటే వ్యక్తిగతంగా బీఆర్ఎస్ నాయకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు గట్టు సతీశ్, బాల ముకుందం, ఒద్ది రామ్మోహన్ రావు, దారిశెట్టి రాజేశ్, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పాపం పసివాడు



గణేశ్ (ఫైల్)

- గోడను ఢీకొన్న కాంక్రీట్ మిక్సర్ వాహనం
- గోడ కూలి బాలుడి మృతి

మేడిపల్లి, మార్చి 19 : కాంక్రీట్ మిక్సర్ వాహన డ్రైవర్ అజాగ్రత్తతో ఓ బాలుడి ప్రాణం పోయింది. నిర్లక్ష్యంగా రివర్స్ చేయడంతో గోడకు తగలగా, దాని పక్కన కూర్చున్న బాలుడి తలపై గోడ పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మేడపల్లి ఎస్ఐ శ్యామ్ రాజ్ వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా వడ్డెరగూడెం గ్రామానికి చెందిన సంపంగి సంగీత, శ్రీను దంపతులకు కూతురు నిహారిక (7), కొడుకు గణేశ్ (4) ఉన్నారు. వీరు గత నెల రోజుల నుంచి కరీంనగర్‌లో కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. నాలుగు రోజుల నుంచి మేడిపల్లి మండల కేంద్రంలో కొత్తగా నిర్మిస్తున్న ఎన్నమనేని ప్రణవికి చెందిన పౌల్ట్రీ ఫామ్ పనులు చేస్తున్నారు. అదే ఫామ్‌లో పని చేస్తున్న పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికి చెందిన అమరగోని రాజు అజాక్స్ కాంక్రీట్ మిక్సర్ వాహనాన్ని అజాగ్రత్తగా రివర్స్ తీయడంతో అది గోడకు తగిలింది. దీంతో ఆ పక్కనే కూర్చున్న సంపంగి గణేశ్‌పై గోడ కూలడంతో తల నుజ్జునుజ్జై అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడి తల్లి సంగీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు.

# కవలలకు 'పది' పరీక్ష



పరీక్షా కేంద్రం వద్ద అన్నదమ్ములు రాము, లక్ష్మణ్

పెగడపల్లి, మార్చి 19: పురుగుల మందు తాగి తండ్రి ఆత్మహత్య చేసుకోగా, ఆ ఇద్దరు కవలలు పుట్టెడు దుఃఖంలో పదో తరగతి పరీక్ష రాశారు. ఈ విషాదకరమైన ఘటన జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికపల్లిలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. బతికపల్లికి చెందిన గాజె చంద్రయ్య మూడు రోజుల క్రితం పురుగులమందు తాగాడు. ఈ క్రమంలో జగిత్యాల దవాఖానలో చికిత్సపొందుతూ, సోమవారం రాత్రి మృతిచెందాడు. చంద్రయ్యకు ఇద్దరు కవలలైన కొడుకులు రాము, లక్ష్మణ్ స్థానిక జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. తండ్రి చనిపోయిన దుఃఖంలో ఉన్న వారికి ఉపాధ్యాయులు, బంధువులు మనోధైర్యాన్ని కల్పించడంతో మంగళవారం వారు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో హిందీ పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష పూర్తయ్యాక వారు తండ్రి దహన సంస్కార కార్యక్రమంలో పాల్గొన్నారు.



చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

# చిన్నారులకు కలెక్టర్ అన్నప్రాసన

జమ్మికుంట పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ పమేలా సత్పతి హాజరై, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. పోషణ్ పక్వాడాను సద్వినియోగం చేసుకోవాలని, పోషకాహార లోపంలేని సమాజాన్ని నిర్మించడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములవ్వాలని ఆమె పిలుపునిచ్చారు.

- జమ్మికుంట, మార్చి 19

